క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని పలు కాలనీలలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శ్రీనివాస్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు కన్యకా పరమేశ్వరి దేవాలయం ఫీడర్ లో మరమ్మతు కారణంగా ఎల్లికల్ రోడ్డు, కన్యకా పరమేశ్వరి దేవాలయం, కూరగాయల మార్కెట్, శిల్పి హోటల్, ఐబీ, సిల్వర్ జూబ్లీ క్లబ్ ఏరియా, గాంధీనగర్, రిలయన్స్ మార్ట్, బ్రహ్మంగారి దేవాలయం పరిసర ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కందనూలు: ఎరువులు, మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యశ్వంత్‌రావు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రైతు యొక్క ఆధార్‌కార్డు, పాసుపుస్తకం తీసుకొని యూరియా పంపిణీ చేయాలని, ప్రతి రైతు వివరాలను రిజిస్టర్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. డీలర్లు నియమ నిబంధనలు పాటించాలని కోరారు.

ఓటు హక్కు నమోదుకు అవకాశం

కల్వకుర్తి రూరల్: ఓటు హక్కు నమోదు కోసం 18 ఏళ్లు పూర్తైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ జనార్దన్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలోని వివిధ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జూలై ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులని వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1200 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రములను గుర్తించి కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. తహసీల్దార్ ఇబ్రహీం, ఎన్నికల డీటీ కల్మచర్ల రాఘవేందర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ



వంగూరు: మండలంలోని తుమ్మలపల్లి యూపీఎస్ పాఠశాలలో గురువారం అధికారులు అల్పాహార పంపిణీ ప్రారంభించారు. ఉపాధ్యాయుడు కోటేశ్వర్‌రావు కుమారుడు రిక్కితేజ ఇదే పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రిక్కితేజ గీసిన ఛాయాచిత్ర బొమ్మలతో ఆకట్టుకున్నాడు. దీంతో హైదరాబాద్‌కు చెందిన హార్ట్ ఫుల్‌నెస్ కన్హా శాంతివనం సభ్యులు పాఠశాలకు చేరుకొని రిక్కితేజను అభినందించారు. ఉపాధ్యాయుల, అధికారుల సూచన మేరకు ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ నిహారిక ప్రతిరోజు అల్పాహారం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ మరళీ మోహన్, ఎంపీడీఓ బ్రహ్మచారి, ఎంఈఓ మురళీమనోహరాచారి, మాజీ సర్పంచ్ అల్వాల్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చారకొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇటీవల ప్రమాదాల, అనారోగ్యాల కారణంగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఏడుగురికి సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరయ్యింది. అగ్రహారంతండాకు చెందిన గ్యార నరేష్ రూ. 60 వేలు, చారకొండ కు చెందిన తిర్పతమ్మ రూ. 44 వేలు, సిర్సనగండ్ల చంద్రమౌళి రూ.30 వేలు, తిప్పరాతి శ్రావణి రూ. 60 వేలు, గైరాన్ తండా నేనావత్ హంజీ రూ. 24 వేలు, సారం బండతండా కేతావత్ సుధా రూ.60 వేలు, కమాల్‌పూర్ కేతావత్ కవిత రూ.18 వేలు మంజూరు అయ్యాయి. గురువారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ వెంకట్ గౌడ్, బాల్‌రాం గౌడ్, నాయకులు గోపాల్, భీదాస్ నాయక్ తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు

తిమ్మాజిపేట: ఎట్టకేలకు మరికల్ కమాన్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గంతలను గురువారం సిమెంట్ కంకర వేసి రోడ్డు పూడ్చారు. ఇటీవల కురుస్తున్న వర్షానికి మరికల్ కమాన్ వద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు కిందపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. బుధవారం రాత్రి గుమ్మకొండకు చెందిన తండ్రి కొడుకులు, తిమ్మాజిపేటకు చెందిన ఇద్దరు యువకులు గాయపడిన ఘటనలు ఉన్నాయి. ఈ ఘటన సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో పాటు పత్రికలలో ప్రచురితం అయ్యింది. దీంతో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదయ్యలు స్పందించి రోడ్డుకు మరమ్మతు పనులు చేయించారు.

ప్రత్యేక పాలనలో సమస్యల తిష్ట

- రోడ్లపై పారుతున్న మురుగు
- పట్టించుకోని అధికారులు



కోడేరులో బురదమయంగా మారిన రోడ్డు



కోడేరులో మురుగుకాల్వలో పేరుకున్న చెత్త

కోడేరు: ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామీణ ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారు. సర్పంచ్‌ల పాలన ముగియడంతో గ్రామాలను ప్రత్యేక అధికారులు సందర్శించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. మౌలికవసతులు కల్పించడంతో అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్యలు ఉన్నాయని తెలిసినా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆశించిన ఫలితాలు రాకపోగా మరిన్ని సమస్యలు నెలకొన్నాయి.

లోపించిన పారిశుద్ధ్యం

అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. జనుంపల్లి, తీగలపల్లి, నాగులపల్లి, మైలారం, నర్సాయపల్లి, కొండ్రావుపల్లిలలో మురుగుకాల్వలు నిండి రోడ్లపైనే ప్రవహిస్తోంది. చెత్తాచెదారం రోడ్లపైనే దర్శనమిస్తోంది. దీంతో కంపవాసనతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాలబారిన పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్లపై నడవలేని పరిస్థితి

గ్రామాలలో రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కోడేరు నుంచి నాగులపల్లి వరకు ఖానాపూర్ నుంచి కోడేరు గుట్ట వరకు రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా తయారయ్యాయి. వర్షాకాలం కారణంగా ఉన్న రోడ్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. గుంతలమయంగా మారడంతో అడుగు తీసి అడుగువేయలేని దుస్థితి నెలకొంది.

మురుగు తొలగించాలి



గ్రామంలో మురుగు రోడ్లపైనే పారుతోంది. ఇళ్ల మధ్య మురుగు నిల్వ ఉంటోంది. కంపువాసన భరించలేకపోతున్నాం. చెత్తా చెదారం ఎప్పటికప్పుడు తొలగించాలి. దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు.

– రఘు, నాగులపల్లి

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో ఎక్కడైనా సమస్యలుంటే వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్యం లోపించకుండా కృషి చేస్తా. గ్రామాల నెలకొన్న సమస్యలను అధికారులకు తెలపాలి. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటాం.

– శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ, కోడేరు

సరిపడా యూరియా అందించాలి



నాగర్‌కర్నూల్‌లో సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు



అచ్చంపేటలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు

నాగర్‌కర్నూల్ రూరల్: రైతులకు సరిపడా యూరియా అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్ అన్నారు. గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులకు యూరియా సరిపడా ఇవ్వాలని సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రెండెకరాలకు తక్కువగా ఉన్న రైతులకు యూరియా అందించడం లేదని దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రైతులకు యూరియా అందక కార్యాలయాల చుట్టు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాలయ్య, రాము, శివ, కుమార్, సురేష్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి

అచ్చంపేట రూరల్: యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వ విఫలం అయ్యిందని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు ఆరోపించారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎరువులు, యూరియా బస్తాల కోట తగ్గించి రైతులను ఇబ్బందికి గురి చేస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నాయకులు దేశ్యానాయక్, శివకుమార్, సైదులు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మదేవి ఆలయ ముఖద్వారం ప్రారంభం



అమ్రాబాద్: మండల కేంద్రమైన అమ్రాబాద్‌లో నూతనంగా నిర్మించిన తిరుమలాపూర్(బీకే) గ్రామంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం ముఖద్వారం గురువారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు. కమాన్ నిర్మాణానికి ఆర్థికసాయం చేసిన మండలంలోని మన్ననూర్ గ్రామానికి చెందిన మొద్దునూరు శేషయ్యను అభినందించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఔత్సాహిక దినోత్సవం

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ ఔత్సాహిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, వనపర్తి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. ఈశ్వరయ్యలు మాట్లాడారు. వ్యవస్థాపకత, వ్యాపారానికి మధ్య గల తేడాలను విద్యార్థులకు వివరించారు. నూతన ఆలోచనాల విధానాలతో వ్యాపార రంగంలో రాణించగలుగుతారన్నారు. సృజనాత్మకతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, రామరాజు యాదవ్, అధ్యాపకులు ఉన్నారు.

అధ్యక్షుడిగా శ్రీనివాసులు

అమ్రాబాద్: మండల కేంద్రంలో ఉన్న అమరేశ్వరాలయ నూతన కార్యవర్గాన్ని గురువారం ఆలయ ప్రాంగణంలో భక్తుల సమక్షంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా తిప్పర్తి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా గోలి వెంకటయ్య, కార్యదర్శిగా నోముల యుగేందర్‌గౌడ్, కోశాధికారిగా వడుగుల శ్రీనివాసులులతో పాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులు ఎంపికయ్యారు. మాజీ అధ్యక్షుడు నాగరాజు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



కురుమిద్ద బోనాల ఊరేగింపు



పోతేపల్లిలో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కల్వకుర్తి రూరల్: బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మండలంలోని కురుమిద్ద, సంజాపూర్ గ్రామాలలో మహిళలు పెద్ద ఎత్తున బోనాలు తలపై ధరించి ఆయా గ్రామాలలో డప్పు, వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కురుమిద్ద లో మాజీ సర్పంచ్ శేఖర్, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లి, పోతేపల్లి, కొట్ర తదితర గ్రామాల్లో గురువారం పోచమ్మ బోనాల ఉత్సవాలను నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మాజీ సర్పంచ్ పెద్ది రామకృష్ణ, సురేందర్, కొండల్‌యాదవ్ ఉన్నారు.

నైవేద్యాలు సమర్పించి..

చారకొండ: మండలంలోని జూపల్లిలో ఈదమ్మ బోనాల వేడుకలను నిర్వహించారు. వడ్డెర కులస్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయి, కోటమైసమ్మకు ప్రదక్షణలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

తెలకపల్లి: వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి తీసుకోవాలని ఎస్ఐ నరేష్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2:00 గంటలకు వినాయక యువక బృందం వారికి పోలీస్‌స్టేషన్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని యువక బృందం సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా వన మహోత్సవం

మన్ననూర్: స్థానిక ఆర్యవైశ్యులు శ్రావణ మాసం చివరి గురువారం వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలోని చెరువుకొమ్ము లింగమయ్య స్వామి ఆలయం వద్దకు ఆయా కుటుంబాలు తరలి వెళ్లారు. అక్కడే వండుకొని వనభోజనాలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీల శ్రీనివాసులు, సంబు శోభ వెంకటరమణ, జూలూరు పద్మజా సత్యనారాయణ, బిల్లకంటి అనిత రమేష్, సంబు సుమతి నరేష్, అనిత శ్రీనివాసులు, కందికొండ భాస్కర్, శివలీల వేణుగోపాల్, రాజేశ్వరీ కుమారస్వామి, పుల్లయ్య పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లి, మాధవానిపల్లి తదితర గ్రామాల్లో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నానాలు ఆచరించి ప్రత్యేకంగా అలంకరించిన గంపలలో నైవేద్యాలు తీసుకొని బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఊరు తూర్పు వైపున గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి అక్కడే వంటలు చేసుకొని సాయంత్రం తిరిగి వచ్చారు.

శాంతియుతంగా నిర్వహించుకోవాలి



పెద్దకొత్తపల్లి: గ్రామాలల్లో వినాయకచవితిని శాంతియుతంగా నిర్వహించుకోవాలని కొల్లాపూర్ సీఐ మహేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితితో పాటు మిలాద్ ఉన్ నబీని ముస్లింలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ సతీష్, ఎంపీడీఓ నాగేందర్, డీటీ రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న టీఎల్‌ఎం మేళా

లింగాల: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ఆవరణలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన టీచింగ్, లర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం) మేళా పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మండలంలోని 17 ప్రాథమిక పాఠశాలలు, మరో 6 ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు వివిధ పాఠ్యాంశాలకు సంబంధించి ప్రయోగాలను ప్రదర్శించారు. గణితం, సైన్స్, తెలుగు, పరిసరాల విజ్ఞానం, సాంఘీక శాస్త్రం తదితర అంశాలకు సంబంధించిన ప్రయోగాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇలాంటి ప్రయోగాలను తరగతి గదిలో ఆచరణలో పెట్టి బోధన చేయడం వలన విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెలుగులో మొదటి బహుమతి యూపీఎస్ అప్పాయపల్లి, రెండవ బహుమతి పీఎస్ అవుసలికుంట, గణితంలో పీఎస్ జీల్గుపల్లి, యూపీఎస్ చెన్నంపల్లి, ఆంగ్లంలో మొదటి బహుమతి పీఎస్ లింగాల, పీఎస్ అవుసలికుంట, ఈవీఎస్‌లో మొదటి బహుమతి చెన్నంపల్లి, రెండవ బహుమతి లింగాల పాఠశాలల దక్కించుకున్నాయి. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నిరంజన్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈఓ బషీర్ అహ్మద్

పంట నష్ట పరిహారం ఇవ్వాలని ధర్నా



నాగర్‌కర్నూల్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

బిజినేపల్లి: అకాల వర్షాల కారణంగా పంటను కోల్పోయిన రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ డిమాండు చేశారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పంటలు నష్ట పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి హనుమంతు, నాయకులు చంద్రశేఖర్, వెంకటయ్య, సుధాకర్, నరసింహ, రాజు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రైతులు పూర్తిగా పంటలు నష్టపోయారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అశోక్ అన్నారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపిలేని వర్షాలతో రైతులు పూర్తిగా నష్టపోయారని, పెట్టిన పెట్టుబడి కూడ వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. వ్యవసాయ అధికారులు గ్రామాలను పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి హనుమంతు నాయకులు చంద్రశేఖర్ మల్లేష్ సుధాకర్ వెంకటయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. మండలంలోని అంతారంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు చేసిన పంటలు జలమయం కావడంతో పంటలు దెబ్బతిన్నాయన్నారు. అధికారులు గ్రామాలను పరిశీలించి నష్టపరిహారం అంచనా వేయాలన్నారు. ఇంద్రకల్, అంతారం ఎటిదారిపల్లి గ్రామాలలో ఇళ్లలోకి వరద చేరి ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో లక్ష్మణ్, భీమయ్య, అనిల్, అంజనేయులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బల్మూర్: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని జినుకుంట శివారులోని ఓ ఫక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన మండల బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పార్టీ మారడంతో కార్యకర్తలు ఎవరు కూడా అధైర్యపడొద్దని, అందరికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆరు గ్యారంటీలు అర్హులకు ఎవరికీ అందడం లేదని కార్యకర్తలు గ్రామాల్లో అధికారులను నిలదీయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేద్దామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మనోహర్, బండపల్లి వెంకటయ్య, మాజీ ఎంపీపీలు కరుణాకర్‌రావు, పర్వతాలు, మాజీ మున్సిపల్ చైర్మన్లు నర్సింహగౌడ్, తులసీరాం, ప్రేమ్‌కుమార్, అమీనోద్దీన్, సుదర్శన్ రావు, కేటీ తిరుపతయ్య, సుధాకర్‌సాగర్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, సింగిల్‌విండో డైరెక్టర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లి తిమ్మినోని చెరువుకు వరద పోటెత్తింది. వరద నీటి ప్రవాహంతో చెరువు నిండి అలుగు పారుతోంది. దేవరకొండ ప్రధాన రహదారి నుంచి శ్రీశైలం ప్రధాన రహదారికి వెళ్లే మట్టి రోడ్డు మధ్య గుండా చెరువుకు వరద ప్రవాహం అధికమవడంతో గ్రామంలోని ప్రజలు అక్కడి నుంచి వ్యవసాయ పొలాలకు, వంగూరుకు వెళ్లేందుకు అంతరాయం ఏర్పడడంతో స్థానిక నాయకులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు గురువారం పంచాయతీ రాజ్ ఏఈ దివ్య, స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి చెరువును పరిశీలించారు. వరదల ద్వార నీటి ప్రవాహం అధికమవ్వడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

బ్రిడ్జి నిర్మించాలని నిరసన



తాడూరు: మండలంలోని తిర్మాలాపూర్‌కు వెళ్లే దారిలో కేసరి సముద్రంపై బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాశన్న మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న చర్లాతిర్మాలాపురం వర్షాకాలంలో జలదిగ్బంధం అవుతోందన్నారు. గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 20 ఏళ్ల కిందట నిర్మించిన బ్రిడ్జి కూరుకుపోవడంతో కేసరి సముద్రంలోకి వచ్చే వరద నీరు ఉధృతంగా ప్రవహించడం వల్ల రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధుల స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుర్మయ్య, భరత్, రామకృష్ణ, రాములు, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

రూ.3 లక్షలు వితరణ



కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర గ్రామంలో ఉన్న అతి పురాతనమైన శివాలయం ఆవరణలో మండప నిర్మాణానికి గురువారం గ్రామానికి చెందిన గోలి సుదర్శన్ రెడ్డి రూ.3 లక్షలు వితరణ చేశారు. ఈ మేరకు గురువారం మండపం నిర్మాణానికి గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆలయాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. పూజారి శ్రీనివాస్ శర్మ, జగన్ మోహన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయకుమార్ రెడ్డి, జైపాల్ రెడ్డి, కృష్ణా రెడ్డి, బుచ్చిరెడ్డి, వెంకట్రాంరెడ్డి, రఘుమా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కుమ్మరి హనుమంతు, కిష్టయ్య యాదవ్, సర్వేశ్వర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సన్మానం

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో గురువారం వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వృద్ధులను పలువురు యువకులు సన్మానించారు. డాక్టర్ లక్ష్మణ్ రావు, మాజీ జెడ్పీటీసీ కాళ్ల కుపానందం, రిటైర్డ్ టీచర్లు ఎంఎస్ ప్రకాష్, రాములు, మన్మథమూర్తిలను సన్మానించారు. కార్యక్రమంలో కాళ్ల నవీన, నర్సింహ, నరేంద్ర మూర్తి, వేణుగోపాల్, బాల్‌రాజ్, పలువురు యువకులు ఉన్నారు.

కవి కోట్ల వెంకటేశ్వర్ నియామకంపై హర్షం

కందనూలు: తెలంగాణ సారస్వత పరిషత్ సర్వ మండలి గౌరవ సభ్యుడిగా ప్రముఖ కవి కోట్ల వెంకటేశ్వర్ నియమించడంపై నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి వహీద్ ఖాన్, గౌరవ అధ్యక్షుడు కందికొండ మోహన్, ఎదిరెపల్లి కాశన్న, కల్వకోలు మద్దిలేటి, ముచ్చర్ల దినకర్‌లు గురువారం హర్షం వ్యక్తం చేశారు. తెలుగు భాషా సాహిత్యాల వికాసానికి విశేష సేవలు అందించినందుకు గాను తెలంగాణ సారస్వత పరిషత్ గుర్తించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో రెండేళ్ల కిందట మార్వాడీలు వ్యాపారాలు చేసుకునేందుకు వచ్చారని వారి రాకతో దుకాణాల అద్దెలను ఒక్కసారిగా పెంచారని స్థానికులు గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రూ.3వేలు ఉన్న కిరాయి ప్రస్తుతం రూ.7వేలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. మార్వాడీల రాకతో కిరాయిలు పెరగడంతో పాటు స్థానికులకు ఉపాధి లేకుండా పోతోందని వివరించారు. అంతకు ముందు మర్వాడీ దుకాణం ముందు నిరసన తెలిపారు. శేఖరయ్య, నాగేష్, మూస, గంగాధర్, రాములు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ పోస్టర్ ఆవిష్కరణ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో చలో హైదరాబాద్ పోస్టర్ ను ఎంఈఓ శంకర్ నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడు మర్యాద కృష్ణారెడ్డి మాట్లాడుతూ పీఆర్టీయూ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు వచ్చే నెల 1న నూనత పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నా నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. వివిధ పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ప్రసూన, వెంకటరమణ, బాలు నాయక్, పద్మ, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ఉప్పునుంతల: సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో వచ్చే నెల 1న నిర్వహించే ధర్నాకు సంబంధిచిన వాల్‌పోస్టర్‌ను గురువారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో నాయకులు ఆవిష్కరించారు. బిచ్యానాయక్, అజ్మతుల్లా, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల విభజన శాస్త్రీయంగా చేపట్టాలి



కల్వకుర్తి రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కల్వకుర్తి మున్సిపాలిటీలోని వార్డులను క్రమ పద్ధతిలో శాస్త్రీయంగా విభజన చేయాలని ఆర్డీఓ జనార్దన్ రెడ్డికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. గురువారం ఓటరు లిస్టులో ఉన్న సమస్యలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా విభజన చేయడం పరిపాటిగా మారిందని ఇది సరికాదన్నారు. ఇంటి నెంబరు ప్రకారం కాకుండా బౌండరీల ప్రకారం వార్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తిలక్ నగర్ కాలనీవాసులకు స్థానికంగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలన్నారు. గుర్రాల రాంభూపాల్ రెడ్డి, బాబీదేవ్, దుర్గాప్రసాద్, నరసింహ, సురేందర్ గౌడ్, విజయ్, చందు ముదిరాజ్, శివ పాల్గొన్నారు.